నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, సోమవారం 16 సెప్టెంబర్ 2024 | NIZAMABAD


## నిరంతర తనిఖీలేవీ?

ఏఈఎస్ స్థాయి అధికారిని నియమించినప్పటికీ నిరంతర తనిఖీలు లేకపోవడంపై సర్వత్రా అనుమానాలు కలుగుతున్నాయి. స్థానికంగా ఉన్నత ఉద్యోగులు లేకపోవడం, పర్యవేక్షణ కొరవడి నిర్లక్ష్యం తాండవిస్తున్నట్లు కింది స్థాయి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. కల్లు డిపోల వ్యవహారాల నుంచి మొదలు అక్రమ మద్యం, కల్తీ మద్యం రవాణా, గంజాయి సరఫరా వంటి ప్రధానమైన లక్ష్యాలను ముందు పెట్టుకున్నప్పటికీ, సర్కారు ఆదేశించిన మేరకు పనితనం కనిపించడంలేదు. దీంతో పాలకుల్లోనూ జవాబుదారీతనం కొరవడడం విడ్డూరంగా మారింది. నిజామాబాద్‌లో గంజాయి రవాణా పెను సవాల్ విసురుతోంది. పోలీసులకు, ఎక్సైజ్ శాఖకు తలనొప్పిగా మారిన ఈ సమస్యపై పెద్ద ఎత్తున శ్రమించాల్సిన సమయంలో ఆబ్కారీ శాఖలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఇటు ప్రభుత్వానికి, మరోవైపు ప్రజలకు ఇబ్బందులను సృష్టిస్తున్నాయి.

# గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

ఉమ్మెడకు తరలనున్న భారీ విగ్రహాలు



నందిపేట రోడ్డులో భారీ చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది



# ఆబ్కారీలో అవినీతి పర్వం!

- నిత్యం వివాదాలమయం
- అక్రమాలతో అపహాస్యం
- గాడి తప్పిన ఇన్‌చార్జి మంత్రి శాఖ
- తీరు మార్చుకోని ఎక్సైజ్ ఉద్యోగులు, సిబ్బంది
- తాజాగా మరో ఎస్‌హెచ్‌వోపైనా తీవ్ర ఆరోపణలు

**నిజామాబాద్ ఆబ్కారీ శాఖ** అప్రతిష్ట మూటగట్టుకుంటున్నది. అవినీతి ఆరోపణలు, నిత్యం వివాదాలతో ఆ శాఖ పరువు బజారున పడుతున్నది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకోవడం గమనార్హం. తీవ్ర అవినీతి ఆరోపణలు, అక్రమ వ్యవహారాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు ఎక్సైజ్ శాఖను అపహాస్యం చేస్తున్నాయి. ఉద్యోగోన్నతులు, బదిలీల పేరిట ఎవరు వచ్చినా పరిస్థితిలో మాత్రం మార్పు కనిపించడంలేదు. కొన్నాళ్లుగా జిల్లాలో వెలుగు చూస్తున్న ఉదంతాలు రాష్ట్రస్థాయిలోనూ చర్చనీయాంశంగా మారాయి. ఎక్సైజ్ శాఖలో కింది స్థాయిలో పనిచేస్తున్న కానిస్టేబుల్ మొదలు ఎస్‌హెచ్‌వోలు, సీఐ, ఈఎస్ స్థాయి వరకు అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

–నిజామాబాద్, సెప్టెంబర్ 15
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**కాంగ్రెస్** పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత ఎక్సైజ్ శాఖ మరింత దిగజారింది. పట్టించుకునే వారే కరువవడంతో ఆబ్కారీ అధికారులకు ఆడిందే ఆట... పాడిందే పాటగా మారింది. మామూళ్ల మత్తులో ఊగుతూ తూగుతూ, తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవినీతికి పాల్పడిన వారిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నా.. అధికారుల్లో కనీస స్పందన కానరాకపోవడం విస్తుగొల్పుతున్నది. ఎక్సైజ్ శాఖలోని కొంత మంది స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సీఐలు మద్యం విక్రయాలతోపాటు మామూళ్ల వసూళ్లలోనూ టార్గెట్లను పెట్టుకుని, పని చేస్తున్నారని తెలుస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా మరో అధికారి అవినీతి ఆరోపణలపై విచారణ చేపడుతున్నారంటూ ఆబ్కారీ సిబ్బందే కోడై కూస్తుండడం గమనార్హం.

### లక్ష్యాలు మరిచి...

రేవంత్ రెడ్డి సర్కారు ఆబ్కారీ శాఖకు కొన్ని లక్ష్యాలను నిర్దేశించింది.ఇందులో ప్రధానంగా బెల్టు షాపుల నియంత్రణ, గంజాయి రవాణా కట్టడి ముఖ్యమైనవి. ఇవేవి పట్టించుకోకుండా నిత్య సంఘర్షణలతో ఆబ్కారీ అధికారులు, సిబ్బంది పాకులాడుతుండడం విడ్డూరంగా మారింది. ఎక్సైజ్‌లో అక్రమాలను అరికట్టేందుకు పని చేసే ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగమైతే చుట్టపు చూపునకే పరిమితమైంది. గత ప్రభుత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిరంతరం దాడులు నిర్వహించేది. మఫ్టీలో మద్యం దుకాణాల్లో సాధారణ వ్యక్తుల్లా వెళ్లి తనిఖీలు చేపట్టేది. దీంతో అధిక ధరల నియంత్రణ జరిగింది. కల్తీ మద్యం వంటిది కానరాకుండా పోయింది. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలేవీ కానరాకపోవడంతో అనేక అక్రమాలు చాప కింద నీరులా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. అక్రమార్కులతో అంటకాగడంవల్లే తనిఖీలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### పత్తాలేని ఇన్‌చార్జి మంత్రి

ఉమ్మడి జిల్లా పరిపాలనను గాలికి వదిలేసిన జూపల్లి కృష్ణారావు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. ఆబ్కారీ శాఖలో గతం లో ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ వ్యవహారం తీవ్ర దుమారం రేపింది. సస్పెన్షన్ వేటు పడినప్పటికీ శాఖ పరువు మంట గలిసింది. నిజామాబాద్ పట్టణ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌పైనా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అదే స్థాయిలో లైంగిక వేధింపులు వెలుగు చూడగా సదరు అధికారి మూ లంగా పరువు బజారున పడింది. ప్రస్తుతం మూడో కల్లు డిపో వ్యవహారం ఆబ్కారీ శాఖ మెడకు ఉచ్చు బిగుసుకుంటోంది. కాంగ్రెస్ నేతలే పాత్రధారులుగా రాజ్యమేలుతున్న ఈ వ్యవహారంలో అడ్డదిడ్డంగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు రోజుకో విధంగా వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఫిర్యాదుల పరంపర రకరకాలుగా వస్తున్నప్పటికీ ఆబ్కారీ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మొన్నటికి మొన్న బోధన్‌లోనూ ఎక్సైజ్ సీఐ చేసిన అవినీతి అరాచకంపై ప్రభుత్వ పెద్దలే ఆశ్చర్యానికి గురై వేటు వేశారు. తాజాగా నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌పై అవినీతి ఆరోపణలు గుప్పుమనగా, విచారణ కొనసాగుతున్నది.

### పర్యవేక్షిస్తున్న ఆయా శాఖల అధికారులు
### ఎనిమిది ఫీట్లలోపు విగ్రహాలు బాసరకు..
### శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను విడుదల చేసిన సార్వజనిక్ గణేశ్ మండలి

నందిపేట్/సుభాష్‌నగర్, సెప్టెంబర్ 15 : గణేశ్ నిమజ్జనానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 17 నిర్వహించనున్న నిమజ్జన శోభాయాత్ర నేపథ్యంలో అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. శోభాయాత్ర మార్గంలో ఎలాంటి ఆటంకాలు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నిజామాబాద్‌తో పాటు చుట్టుపక్కల నుంచి వచ్చే భారీ విగ్రహాలను నందిపేట్ మీదుగా ఉమ్మెడ వద్ద గోదావరి నదికి తరలించనున్నారు. గతంలో చిన్నా, పెద్దా వినాయక విగ్రహాలన్నీ బాసర గోదావరి నదికి తరలించారు. నవీపేట్‌కు వెళ్లే మార్గంలో రైల్వేట్రాక్ పై విద్యుత్ లైన్ అడ్డురావడంతో అప్పటి నుంచి భారీ విగ్రహాలను దారి మళ్లించక తప్పడం లేదు. గతేడాది విగ్రహాలను ఎక్కువ సంఖ్యలో నందిపేట్ లోని వివేకనందా చౌరస్తా నుంచి నవీపేట్ మీదుగా బాసరకు తరలించారు. బాసర కన్నా ఉమ్మెడనే దగ్గర కావడంతో ఈ ఏడాది ఉమ్మెడకు తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఉమ్మెడ గోదావరి నది వద్ద అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. వందలాది సంఖ్యలో విగ్రహాలు ఉమ్మెడకు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. 8 ఫీట్ల లోపు ఉన్న విగ్రహాలు నవీపేట్ మీదుగా బాసరకు, అంతకన్నా ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఉమ్మెడకు తరలించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఇటీవల ఉమ్మెడ గోదావరి ప్రాంతాన్ని పరిశీలించారు. నిమజ్జనం కోసం చేస్తున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. నందిపేట్, నిజామాబాద్ ప్రధాన రోడ్డుకు ఇరుపక్కలా అడ్డంగా ఉన్న భారీ వృక్షాల కొమ్మలు తొలగింపుతో పాటు, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ లైన్ల తొలగింపు, ఉన్న వాటిని ఎత్తు పెంచడం, రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చడం, గతుకులను సరిచేయడం, అవసరం ఉన్న చోట విద్యుత్ లైట్ల ఏర్పాటు తదితర పనులు కొనసాగుతున్నాయి. గోదావరి నది వద్ద వినాయక విగ్రహాలను వంతెనపై నుంచి నదిలో నిమజ్జనం చేసేందుకు మూడు భారీ క్రేన్లను అందుబాటులో ఉంచనున్నారు. నది వద్ద విద్యుత్తు లైట్లను ఏర్పాటు చేస్తున్నారు.

### మూడు ఫీట్లలోపు విగ్రహాలు వినాయకుల బావిలో నిమజ్జనం..

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ వినాయకుల బావిలో మూడు ఫీట్లలోపు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయాలని సార్వజనిక్ గణేశ్ మండలి ప్రతినిధులు సూచించారు. గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సాగే రూట్‌మ్యాప్‌ను ఆదివారం వారు విడుదల చేశారు.



ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

# ముగిసిన సైక్లింగ్ పోటీలు



మెడల్స్ అందుకున్న విజేతలతో అతిథులు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 15: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ సౌత్‌జోన్ సైక్లింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. వివిధ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. సబ్ జూనియర్ (గర్ల్స్) 20 కి.మీ, ఉమెన్ జూనియర్ 30 కి.మీ, ఉమెన్ ఎలైట్ 40 కి.మీ విభాగాల్లో పోటీలు నిర్వహించగా..కర్ణాటక క్రీడాకారులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. సైక్లింగ్ పోటీల్లో దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొనడం గమనార్హం. క్రీడాకారులు ఉపయోగించిన సైకిళ్ల విలువ రూ. 5 లక్షల నుంచి రూ.8 లక్షలు ఉండడంతో చూడడానికి పలువురు ఆసక్తి చూపారు.

### విజేతలకు మెడల్స్ ప్రదానం

ముగింపు కార్యక్రమానికి నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ హాజరై విజేతలకు మెడల్స్‌ను అందజేశారు. నగరంలో సౌత్‌జోన్ స్థాయి క్రీడలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి విజయకాంత్‌రావు, ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ్ రెడ్డి, సైక్లింగ్ జిల్లాఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ సుబేదార్, టి. సూర్యప్రకాశ్, నర్సింగ్‌రావు, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ మాక్స్‌వెల్ ట్రెవర్, రాష్ట్ర కోశాధికారి వెంకట నర్సయ్య, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ ఆకుల రాములు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

# సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- శోభాయాత్ర కోసం పటిష్ట బందోబస్తు
- రెండువేల మంది సిబ్బందితో భద్రతా చర్యలు
- విలేకరుల సమావేశంలో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

వినాయక్‌నగర్,సెప్టెంబర్ 15: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 17న గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి (మల్టీజోన్-1) కోరారు. గణేశ్ శోభాయాత్ర కోసం రెండువేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీపీ కల్మేశ్వర్ సింగేనవార్,అదనపు డీసీపీ కోటేశ్వరరావు, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి,అధిక సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. శోభాయాత్ర జరిగే అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు వీడియో రికార్డింగ్ సైతం చేయనున్నట్లు వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు తెలిపారు. నిమజ్జన శోభభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు మండపాల నిర్వాహకులు, పెద్దలు, యువత, ప్రతి ఒక్కరూ పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజేలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు లేవని, సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల మూసివేత

నిజాంసాగర్, సెప్టెంబర్ 15 : నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం ఎగువప్రాంతం నుంచి 6500 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నదని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువ(విద్యుత్ ఉత్పత్తి కేంద్రం) ద్వారా 2200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరద గేట్లను మూసివేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1405.00 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా, 1404.98 అడుగుల (17.773 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నదని పేర్కొన్నారు.

### ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, సెప్టెంబర్ 15: ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతం నుంచి వరద కొనసాగుతోంది. ఆదివారం ప్రాజెక్ట్‌లోకి 27,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా, ప్రాజెక్ట్‌లో 1091అడుగుల(80.501టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 27,315 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతుండగా ఇందులో కాకతీయ కాలువకు 6800, లక్ష్మికాలువకు 200, మిషన్‌భగీరథకు 231, సరస్వతీకాలువకు 400, వరదకాలువకు 19వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



# విత్తులేని విత్తన క్షేత్రం



సుమారు 800 ఎకరాల భూమి.. 50 ఏండ్లుగా నూతన వంగడాలను ఉత్పత్తి చేసిన నాగిరెడ్డిపేట్‌లోని మాల్తుమ్మెద విత్తన క్షేత్రం.. ఈ సారి విత్తు లేక వెలవెలబోతున్నది. గత నెల మొదటివారం వరకు 70 ఎకరాల్లో పంటలు సాగుచేస్తామని హడావుడిగా ప్రతిపాదనలు పంపినా.. అధికారులు లేకపోవడం, అనుమతులు రాకపోవడంతో సాగునీరు అందుబాటులో ఉన్నా పంటలు పండించలేని పరిస్థితి నెలకొన్నది. ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే క్షేత్రం భూములు కనుమరుగయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 15 : కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద విత్తనక్షేత్రంలో ఈ సారి వర్షాకాలం పంటల సాగు చేపట్టడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విత్తనోత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన విత్తనా క్షేత్రం.. నేడు విత్తు వేయని స్థితికి చేరుకున్నది. క్షేత్రంలో 834, 835 సర్వేనంబర్లలో 802 ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉన్నాయి. 835 సర్వేనంబర్‌లో భూములు సాగుకు అనుకూలంగా ఉండడంతో.. 50 ఏండ్లుగా వివిధ రకాల పంటలను సాగుచేస్తూ నూతన వంగడాలను ఉత్పత్తి చేస్తున్నారు. సరైన నీటి సౌకర్యాలు లేక పూర్తిగా పోచారం ప్రాజెక్టు ప్రధానకాలువపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. ఆగస్టు మొదటివారంవరకు ప్రాజెక్టు నిండితే 70 ఎకరాల్లో పంటలను సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకొని, ప్రతిపాదనలు పంపారు. ఆగస్టు 15 వరకు ప్రాజెక్టు నిండి ప్రధానకాలువ ద్వారా నీరు వదిలినా క్షేత్రంలో పంటలను సాగు చేయలేదు. పంటల సాగు కోసం గత నెలలో హడావుడి చేసిన అధికారులు.. ఇప్పుడు అనుమతులు లేవంటూ మిన్నకుండిపోయారు.

### అధికారులు, సిబ్బంది లేక ఇబ్బందులు

ఇదిలా ఉండగా ఇక్కడ పనిచేసిన ఏడీఏ వీరాస్వామి పోస్టు ఖాళీగా ఉన్నది. క్షేత్రం ఏవో హరివెంకటప్రసాద్‌ను నాగిరెడ్డిపేట ఏవోగా బదిలీ చేయడంతో పాటు క్షేత్రం ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. క్షేత్రం ఏఈవో శ్యాంసుందర్‌కు నాగిరెడ్డిపేట ఏఈవో ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. మరో ఏఈవో రాణిని డిప్యుటేషన్‌పై రామారెడ్డికి పంపారు. దీంతో క్షేత్రం ఆలనాపాలనా కరువైంది. ఒక ఏడీఏ, ఇద్దరు ఏవోలు, నలుగురు ఏఈవోలు, 15 మంది సిబ్బందితో కళకళలాడిన క్షేత్రం.. నేడు అధికారులు లేక వెలవెలబోతున్నది. నూతన వంగడాలను అందించే క్షేత్రం.. నేడు విత్తనం ఉత్పత్తి చేయలేని స్థితికి చేరుకున్నది. నిర్వహణ ఇలాగే ఉంటే.. క్షేత్రానికి సంబంధించిన భూములు కనుమరుగవుతాయని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


వరల్డ్ లా డే శుభాకాంక్షలు..













